క్లుప్తంగా

ఎంఈవో 2గా జ్ఞానశంకర్ బాధ్యతల స్వీకరణ



జ్ఞాన శంకర్‌ను అభినందిస్తున్న ఎంఈవో

నెల్లిమర్ల: మండల విద్యాశాఖాధికారి – 2గా వి.జ్ఞానశంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొండవెలగాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎంఈవో – 2గా బాధ్యతలు అప్పగిస్తూ సంబంధిత అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన జ్ఞానశంకర్‌ను ఎంఈవో–1 యు.సూర్యనారాయణమూర్తి, కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు జిల్లా కార్యదర్శి సన్యాసిరాజు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పతివాడ త్రినాధ్, ఉండ్రు శ్రీనివాసరావు, కుసుమంచి మోహన్, గణేష్ తదితరులు అభినందించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో మొయిద జంక్షన్ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య పనులను నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యంగా జరజాపుపేట వెళ్లే మార్గంలో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో ఆ సమస్య పరిష్కరించేందుకు చర్చించారు. అలాగే మురుగునీరు వెళ్లే కాలువలపై పలకలు వేయడంతో చెత్త తొలగించడం సమస్యగా మారిందని, అటువంటిది లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లించకుంటే నీటి సరఫరా బంద్




ప్రత్యేక డ్రైవ్‌లో సచివాలయ సిబ్బంది

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి పన్నుల బకాయిలను సకాలంలో చెల్లించాలంటూ సచివాలయ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దీర్ఘకాలికంగా బకాయి ఉన్న ఇంటి యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. మొండి బకాయిదారులకు నోటీసులను జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నీటి పంపిణీకి ఎంతో వ్యయ ప్రయాసలు కోర్చి తాము కృషి చేస్తున్నామన్నారు. నీటి పంపిణీకి నిరంతరం శ్రమించాల్సి ఉంటుందని చెప్పారు. సకాలంలో నీటి చార్జీలను చెల్లించి సహకరించాలని చెప్పారు. నీటి చార్జీలు చెల్లించని వారి కుళాయి కనెక్షన్లను తొలగించి వేయాలని సిబ్బందికి ఆదేశించామని చెప్పారు. సిబ్బందికి రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. నీటి చార్జీల వసూళ్ల అవశ్యకతను వివరిస్తూ ప్రజలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో ఇటీవల ప్రారంభమైన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి దాతలు శుక్రవారం విరాళాలు అందజేశారు. టెక్కలి గ్రామానికి చెందిన పూర్ణచంద్ రూ.10వేలు, మరో దాత తారకేశ్వరరావు రూ.11వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా సాయం అందించినట్టు వారు తెలిపారు. అనంతరం స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శరణ్య

దెంకాడ : రఘుమండ హెచ్‌బీ సచివాలయంలో స్పెషల్ డ్రైవ్ లెప్రసీపైన అవగహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అదేవిధంగా లెప్రసీ కేసులు కోసం ఇంటింటా సర్వే చేశారు. టీబీ ప్రిజంటివ్ కేసులకు ఫుడ్ బాస్కెట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏఓ శరణ్య, ఎంపీహెచ్‌ఎస్ యస్.సూరిబాబు, సీనియర్ టీడీపీ నాయకులు పిళ్లా రాజశేఖర్, ఏఎన్‌ఎం రాజేశ్వరి, సుభద్ర, ఆశా కార్యకర్తలు పైడిరాజు, గౌరీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పూడికలు.. తొలగించాలిక..!

- ప్రారంభమైన అకాల వర్షాలు
- మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నైరుతి ప్రభావం
- ప్రధాన కాలువుల్లో పూర్తికాని పూడికతీత పనులు
- వర్షాకాలం ప్రారంభమైతే తప్పని ముంపు కష్టాలు



జిల్లా కలెక్టర్ కార్యాలయంకు వెళ్లే మార్గంలోని ప్రధాన కాలువలో పేరుకుపోయిన పూడికలు

విజయనగరం: అకాల వర్షాలు కురుస్తున్నాయి. త్వరలో నైరుతి రుతుపవనాలు రానున్నాయి. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవనున్నాయి. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు ఎక్కడిపడితే అక్కడ మురుగు పొంగి రోడ్లపైకి చేరుతోంది. ఈ నేపథ్యంలో పట్టణాలు ముంపు బారిన పడకుండా కాలువల్లో పూడిక తీయాల్సిన తరుణమిదే. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఏటా వర్షాకాలం ప్రారంభం నాటికి డ్రెయిన్లలో పూడికతీత, వ్యర్థాలు తొలగించాలి. ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలి. ఇది మున్సిపల్ శాఖ నియమావళి. చాలా చోట్ల నగరంలోని డ్రెయిన్లలో పూడిక తీయటంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో డ్రెయిన్లు వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వస్తోంది. కమిషనర్ అండ్ డెవెలప్‌మెంట్ ఆఫ్ మున్సిపల్ ఎడ్మినిస్ట్రేషన్ అధికారులు ప్రతి ఏడాది తరహాలోనే ఈ ఏడాది కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహిస్తున్న సమీక్షల్లోనూ, టెలికాన్ఫరెన్సుల్లో పూడికతీతకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కమిషనర్లు ఆ దిశగా చర్యలు చేపడితే ప్రజలకు వరద నీటి కష్టాలు తప్పుతాయి. గతేడాది మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులను రూ.15 లక్షల మేర నిధులు కేటాయించి పనులు చేపట్టగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.9.97 లక్షలు కేటాయించారు. కేటాయించిన నిధులతో కొన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు నిర్ణయించగా.. మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20 కిలోమీటర్ల మేర పెద్ద వరద నీటి కాలువలు ఉన్నాయి. అంతేకాకుండా మరో 450 కిలోమీటర్ల మేర చిన్న తరహా కాలువులున్నట్టు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ఇవి కాకుండా మధ్యతరహా కాలువలు 82 కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి. ప్రతి ఏడాది వర్షా కాలంలో మోస్తరు వర్షం కురిసిన సమయంలో కూడా ఈ కాలువలన్నీ చెరువులు తలపిస్తాయి. నగర పరిధిలో గల చిన్న పాటి చెరువులు, గెడ్డలు పొంగి ప్రవహించటంతో ఆ నీరంతా ఉప్పొంగి కాలువుల్లోకి ప్రవహిస్తుండగా.. పూడికలతో నిండిన కాలువల సామర్థ్యం చాలక మురుగు నీరంతా రోడ్లపై చేరి రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతుంది. నగరంలోని ప్రధానంగా కలెక్టరేట్ జంక్షన్, ప్రకాశం పార్కు, కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, సిటీ బస్టాండ్ రోడ్, గంటస్తంభం జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్, వైఎస్సార్ జంక్షన్ దాసన్నపేట, రాజీవ్‌నగర్ కాలనీ, భగవాన్‌నగర్, నటరాజ్‌కాలనీ, పద్మావతినగర్, వైఎస్సార్‌నగర్ రోడ్ తదితర ప్రాంతాల్లో తరుచూ ఈ సమస్య ఉత్పన్నమవుతున్నా పరిష్కరించటంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది.

ఈ ఏడాది ముంపు సమస్య తప్పదా..?

చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా మారింది నగరంలోని కాలువల్లో పూడికతీత పనులు. వాస్తవానికి వర్షాకాలనికి ముందుగా వచ్చే వేసవి సమయంలో కాలువల్లో పూడికతీతలకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. అయితే అధికారులు మాత్రం వేసవి ముగిసే సమయంలో పనులు ప్రారంభించటం పట్ల సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో రోజు వారి పనులు చేపడుతుండగా.. ఎప్పటికి ఆ పనులు పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఏడాది నగరంలో ముంపు సమస్య తప్పదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పనులు చేపడుతున్నాం..

నగరంలోని ప్రధాన కాలవుల్లో పూడికతీత పనులు చేపడుతున్నాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని పనులు పూర్తి చేశాం. ఇందుకోసం రూ.9.97 లక్షల నిధులు కేటాయించారు. అన్ని ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరితగతిన పనులు చేపట్టేలా సిబ్బందికి ఆదేశాలిచ్చాం. గత కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటంతో పనులకు ఆటంకంగా మారుతోంది.

– కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి, విజయనగరం కార్పొరేషన్

● చెత్త.. చెత్త...



విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీ రోడ్డులో చెత్త కుప్పలుగా పేరుకుపోయినా పట్టించుకున్నవారు కరువయ్యారు. గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ వద్ద చెత్త తొలగించకపోవటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త తరలింపులో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో డంపర్ బిన్ నిండి పరిసర ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో చెత్త పేరుకుపోయింది. గత రెండు రోజులుగా కురుస్తున్న చెదురుమదురు వర్షపు జల్లులతో చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – విజయనగరం

● రోడ్డెక్కిన మురుగు



విజయనగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో మురుగు నీరు రోడ్డెక్కింది. ఈ ప్రాంతంలో ఉన్న వాటర్ ట్యాంక్ పరిసరాల నుంచి లీకైన నీరు ప్రవహించేందుకు కాలువలు లేకపోవటంతో పక్కనే ఉన్న పబ్లిక్ అండ్ హెల్త్ కార్యాలయం ముందు భాగం నుంచి రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో కార్యాలయానికి వచ్చే వెళ్లే అధికారులు, సిబ్బంది తదితరులు ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి మురుగునీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు. – విజయనగరం

జిల్లా సర్వజన ఆసుపత్రికి గండం

- జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ



నివేదిక విడుదల చేసిన పౌర వేదిక అధ్యక్షుడు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఉన్నచోటే కొనసాగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించడం సరికాదని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. పౌరవేదిక కార్యాలయంలో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. పౌర వేదిక ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లా సర్వజన ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులు, డాక్టర్లు సిబ్బందితో సమావేశమై ఆసుపత్రిలోని పరిస్థితులపై ఒక నివేదిక తయారు చేసి జిల్లా సర్వజన ఆసుపత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు వెంటనే తరలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులకు అందజేశామన్నారు. రోగులు, డాక్టర్లు సిబ్బంది వసతులు చాలక ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు పెడుతుంటే, మంత్రి ఉన్న చోటే ఆసుపత్రిని ఉంచాలని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన నిర్ణయాన్ని పునఃరాలోచించి ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో న్యూరో, న్యూరోమెడిసన్, నెఫ్రాలజీ, యూరాలజీ, మెడికల్ అంకాలజీలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. మరోసారి కరోనా విజృంభించే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరిందని ఇటువంటి సమయంలో రోజుకు 15 వందల నుంచి 2 వేల వరకూ ఓపీ చూసే ఆసుపత్రిని ఇరుకు గదుల్లో నిర్వహించడం మంచిది కాదని భీశెట్టి హితవు పలికారు. పౌర వేదిక తయారుచేసిన నివేదికను విడుదల చేశారు. సమావేశంలో పౌరవేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, తుమ్మగంటి రాంమోహనరావు, ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిస రామకృష్ణ పాల్గొన్నారు.


జేవీవీ మహాసభలు రేపు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నేతలు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 25న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే జన విజ్ఞాన వేదిక మహాసభల ఆహ్వాన పత్రికను జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ ఎంవీఆర్‌కృష్ణాజీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా శాస్త్రీయ ఉద్యమం కోసం పనిచేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రజలను శాస్త్ర విజ్ఞానం దిశగా నడిపించేందుకు అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవీ పూర్వ అధ్యక్షుడు అల్లూరి శివ వర్మ, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంధ్రేటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష, కార్యదర్శులు శివాజీ, షణ్ముఖరావు, సీరాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి



సీతారామునిపేట ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేకాధికారి వెంకటరమణ

నెల్లిమర్ల రూరల్: గతంలో ఇళ్ల స్థలాలు మంజూరై ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోని లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేకాధికారి వెంకటరమణ సూచించారు. మండలంలోని సీతారామునిపేటలో గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు మంజూరైన లబ్ధిదారులతో శుక్రవారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే అదనపు సహాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, లేకపోతే స్థలాలు స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం స్థానిక అధికారులతో మాట్లాడి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ మురళీ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన వారందరినీ విచారించాలి



కోట వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ జేఏసీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన వారందరినీ విచారణ చేయాలని కోరుతూ విజయనగరం యూత్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక కోట వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా యూత్ జేఏసీ ప్రతినిధులు మజ్జి రమేష్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన సిరాజ్ తండ్రి ఏఎస్ఐ, సోదరుడు పోలీస్ కానిస్టేబుళ్లుగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోనే పని చేస్తున్నారని, వారిని తక్షణమే సస్పెండ్ చేసి, కస్టడీలోకి తీసుకుని విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా విజయనగరం నివాసి అయిన సిరాజ్ ఉర్ రెహ్మాన్‌ను వారి స్నేహితులను, సన్నిహితులను, బంధువులను విచారణ చేయాలన్నారు. ప్రశాంతంగా ఉండే విజయనగరంలో భారీ పేలుళ్ల కుట్రలకు కార్యాచరణ చేయడం విజయనగరం యువత పక్షాన ఖండిస్తున్నామన్నారు. ఉగ్ర కుట్రను భగ్నం చేసిన ఎన్ఐఏ, జిల్లా పోలీసు శాఖకు ధన్యవాదాలు తెలిపారు. సిరాజ్ స్నేహితులు, కుటుంబీకులకు వివిధ బ్రాంచ్‌లలో ఉన్న బ్యాంక్ లావాదేవీలను, లాకర్లను నిలుపుదల చేసి విచారణ చేయాలన్నారు. నిఘా వ్యవస్థను మరింత అప్రమత్తం చేసి, పట్టణంలో నివసిస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కట్ల బాబు, ఉదయ్, ధనుష్, ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న క్రెడయ్ ప్రతినిధులు

విజయనగరం: పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్రెడయ్ సంస్థ ప్రతినిధులు హాజరై టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీవోలలో ఎదురైన అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా కమిషనర్ కృషి చేయాలని కోరారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. మరికొంతమంది టీడీఆర్ సమస్యలపైన ప్రస్తావించారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్, బీపీఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో 3 నెలలు గడువు పొడిగించిందన్నారు. వ్యక్తిగత దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చొరవ చూపాలన్నారు. నగరంలో అనధికార ఫ్లెక్సీ బోర్డులు ఉండరాదన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు హరిబాబు, రమణమూర్తి, టీపీవో అప్పలరాజు, క్రెడయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కళల పరిరక్షణ అందరి బాధ్యత

- మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ అనురాధ
- ముగిసిన వాగ్దేవీ బాల సంస్కార శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

విజయనగరం టౌన్: కళలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ బురిడి అనురాధ పరశురామ్ పేర్కొన్నారు. స్థానిక గురజాడ స్వగృహంలో వాగ్దేవీ సమారాధనం సంస్థ, తెలుగు భాషా పరిరక్షణ సమితితో కలిసి పది రోజుల పాటూ నిర్వహించిన వాగ్దేవీ బాల సంస్కార శిక్షణా శిబిరాల ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాన్ని పరిచయం చేసేందుకు, వాటిని పరిరక్షించాలనే లక్ష్యంతో వాగ్దేవీ సమారాధనం సంస్థ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంతో పాటూ భగవద్గీత సారాంశాన్ని పది రోజుల పాటూ వివరించామన్నారు. శతక పద్యాలపై అవగాహన పెంపొందించగలిగామన్నారు. ఈ సందర్భంగా పది రోజుల పాటూ ఉచిత రీతిన విద్యార్థులను సుశిక్షితులను చేసిన గురువులను సత్కరించి, ప్రశంసపత్రం, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులకు బహుమతులు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ జి.ఎరుకునాయుడు, డాక్టర్ జక్కు రామకృష్ణ, అమ్మాజమ్మ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, గురజాడ ఇందిర, మానాప్రగడ సాహితీ, కొంకెపూడి అనూరాధ, చెల్లాపిళ్ల శ్యామల, గిరిజా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న తమ్మిన సిస్టర్స్ భక్తి కచేరీ



గాత్రకచేరీ చేస్తున్న తమ్మిన సిస్టర్స్

విజయనగరం టౌన్: స్థానిక తెలకలవీధి రామమందిరం ఆవరణలో శుక్రవారం రాత్రి తమ్మిన సిస్టర్స్ భక్తికచేరీ ఆద్యంతం ఆహుతులను అలరించింది. తమ్మిన షణ్ముఖ ప్రియ అద్భుతమైన రామగానాన్ని ఆలపించారు. మృదంగంపై సాహితీప్రియ, వయోలిన్‌పై రవికుమార్‌లు సహకారమందించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వహకులు తమ్మిన సిస్టర్స్‌ను దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తా..



మాట్లాడుతున్న జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు

దత్తిరాజేరు: నాపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు అప్పలనాయుడును దత్తిరాజేరు మాజీ సర్పంచ్ మహదేవ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, తదితరులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. రైతులను కలుపుకుని పోరాటం చేయాలని అప్పలనాయుడుకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మండల శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు నిబంధనలు పాటించాలి



బాలాజీ కూడలి వద్ద నైట్ పెట్రోలింగ్ తనిఖీలు చేపడుతున్న ఎక్సైజ్ అధికారులు

విజయనగరం టౌన్: నిబంధనలకనుగుణంగా మద్యం షాపులు నడపాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీఎన్.బాబ్జీరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ప్రోహిబిషన్, ఎక్సైజ్ శాఖ డివిజన్ ఆధ్వర్యంలో నైట్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి విజయనగరం, పార్వతీపురం జిల్లాలో మద్యం షాపులు, రెస్టారెంట్స్ అండ్ బార్స్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమయపాలన, విడి విక్రయాలు, ఎంఆర్‌పీకి మించి అమ్మకాలు లేకుండా చూడటం, అనధికార సిట్టింగ్‌లను నివారించడం, షాపు పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచడం, రికార్డులను సమర్థవంతంగా ఉంచడం, సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు ఇన్‌స్పెక్టర్లు, పర్యవేక్షకులు పరిశీలించాలని ఆదేశించారు. మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఎక్సైజ్ ఐ అనే మొబైల్ యాప్ అప్లికేషన్‌ను త్వరలో తీసుకువస్తామన్నారు. ఎక్సైజ్ నేరాలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నంబరు 14405కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.